క్లుప్తంగా

ఘనంగా పునర్వసు నక్షత్ర హోమం



హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం సింహగిరిపై గంగధార వద్ద నున్న పురాతన రామాలయంలో హోమాన్ని విశేషంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలోని మండపంలో కొలువుంచారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను ఘనంగా జరిపారు. భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ పర్యవేక్షణలో అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా దుర్గామల్లేశ్వర కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు, ప్రజాప్రతినిధులు

పెందుర్తి: మండలంలోని సౌభాగ్యరాయపురం (ఎస్ఆర్ పురం)లో కొలువుదీరిన కనకదుర్గమ్మ ఆలయ 12వ వార్షికోత్సవం బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకం, ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దుర్గామల్లేశ్వర కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. గ్రామ పురవీధుల్లో పల్లకి సేవ చేశారు. సాయంత్రం రకరకాల పిండివంటలు, ఫలాలతో సారె ఊరేగింపు చేసి అమ్మవారికి నివేదించారు. సామూహిక హోమాలు జరిపారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, అంజి దంపతులు, సర్పంచ్ దూది విజయలక్ష్మి, వెంకటరమణ దంపతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో ఆక్రమణల తొలగింపు



శ్మశానవాటికను పరిశీలిస్తున్న తహసీల్దార్

సబ్బవరం: మండలంలోని ఎల్లుప్పి గ్రామంలో కబ్జాకు గురైన శ్మశానవాటిక భూమిని రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్ బి.చిన్నికృష్ణ మాట్లాడుతూ ఎల్లుప్పి సర్వే నెం.10/1సీ లో ఉన్న ఎకరం ప్రభుత్వ భూమిని గతంలో శ్మశానవాటిక కోసం కేటాయించినట్లు తెలిపారు. ఈ భూమి ప్రస్తుతం ఖాళీగా ఉండటంతో కొంతమంది అక్రమించుకునే ప్రయత్నం చేయగా తమకు అందిన సమాచారం మేరకు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిలో ఉన్న ఆక్రమణలను తొలగించామన్నారు. ఆ భూమికి రక్షణ కల్పించే బాధ్యతను గ్రామ పెద్దలు ఉగ్గిన రాము, ఉగ్గిన గంగునాయుడులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. శ్మశానవాటిక స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశీలించినవారిలో ఆయన వెంట వీఆర్వో ఎం.గోవిందరావు, సర్వేయర్ ఎల్.శ్యామ్‌కుమార్ ఉన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



పరవాడ: లంకెలపాలెం ఫ్లై ఓవర్ కింద రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు బుధవారం గుర్తించారు. దువ్వాడ రైల్వే పోలీసులు అందించిన వివరాలు. మృతునికి 30–35 ఏళ్ల వయస్సు ఉంటుంది. చామన చాయ రంగు కలిగి, శరీరంపై పసుపు రంగు షర్టు, నలుపు రంగు జీన్స్, గ్రే కలర్ స్వెటర్ ధరించి ఉన్నాడు. కుడిచేతిపైన అమ్మ–గీత అని తెలుగులో పచ్చబొట్టు ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి వెల్లడించారు. వివరాలు తెలిస్తే 7382058996ను సంప్రదించాల్సిదిగా కోరారు.

వలవిల



ముత్యాలమ్మపాలెం తీరంలో గంగపుత్రులు వలలు భద్రపర్చుకోవడం, పాడైన వలలు కుట్టుకోవడం తదితర అవసరాలకు 30 ఏళ్ల క్రితం నిర్మించిన రెండు భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఏ క్షణం కూలిపోతాయో తెలియని స్థితిలో మత్స్యకారులు భయంభయంగా గడుపుతున్నారు. 2018లో నాబార్డు నిధులు రూ.1.18 కోట్లతో నిర్మించిన మరో రెండు భవనాలు కూడా నిర్వహణ లేక మరమ్మతులకు గురయ్యాయి. స్వల్ప మరమ్మతులకూ అధికారులు మీనమేషాలు **లెక్కిస్తుండటంతో అసాంఘిక కార్యకలా**పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి.

- శిథిలావస్థకు వలల అల్లిక భవనాలు
- కొత్త భవనాలకు బీటలు
- చిన్నచిన్న రిపేర్లకూ మీనమేషాలు
- ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం మత్స్యకారుల ఆవేదన



మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్న వలలు అల్లుకునే నూతన భవనం

పరవాడ: ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం గ్రామాల్లో రెండు వేల మత్స్యకార కుటుంబాలు చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. చేపల వేట ముగిసిన తరువాత గంగపుత్రులు తమ వలలు, ఇంజిన్లు, వేట సామగ్రిని భద్రపర్చుకునేందుకు, పాడైన, చిరిగిన వలలను అల్లుకునేందుకు ప్రభుత్వం నాలుగు భవనాలను నిర్మించింది. తీరంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన రెండు సామాజిక భవనాలు శిథిలావస్థకు చేరి, ఏ క్షణం కూలిపోతాయోనన్న స్థితిలో ఉన్నాయి. ఆరేళ్ల క్రితం నిర్మించిన మరో రెండు భవనాలు కూడా చిన్న చిన్న మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారాయి.

బీటలు వారి.. తుప్పలు పెరిగి

మాధవస్వామి ఆలయ సమీపంలో నిర్మించిన భవనం పూర్తిగా మరమ్మతులకు గురైంది. గచ్చులు పాడైపోయాయి. ఏ మాత్రం వర్షం పడిన శ్లాబు కారిపోతుంది. మెట్ల మార్గం పూర్తిగా దెబ్బతిని, కూలిపోయింది. భవనం ముందు చేపలు ఆరబెట్టుకునేందుకు ఏర్పాటు చేసిన ప్లాట్ ఫామ్ బీటలు వారి, తుప్పలు పెరుగుతున్నాయి. దీంతో ఎండు చేపల సీజన్లో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ భవనానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

8 పిల్లర్లలో 3 శిథిలం

తీరానికి అతి సమీపంలో నిర్మించిన మరో భవనానిదీ అదే దుస్థితి. దీనికి ఉన్న 8 పిల్లర్లలో మూడు పిల్లర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పిల్లర్ల చుట్టూ పెచ్చులూడి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. ఏమాత్రం పిల్లర్లు విరిగినా శ్లాబ్ కూలిపోయే ప్రమాదం ఉందని మత్స్యకార్మికులు ఆందోళన చెందుతున్నారు. గచ్చులు కూడ పాడయ్యాయి. పిల్లర్లు దెబ్బతినడంతో భవనంలో వలలు కుట్టుకునేందుకు సాహసించలేని పరిస్థితి. దెబ్బతిన్న పిల్లర్లకు మరమ్మతులు చేపడితే భవనంలో మరికొంత కాలం మనుగడ సాగించవచ్చని గంగపుత్రులు చెప్తున్నారు.

ఆరేళ్ల భవనాలు.. అప్పుడే మరమ్మతులు

ఆరేళ్ల క్రితం రూ.1.18 కోట్ల నాబార్డు నిధులతో మత్స్యకారులు వలలు అల్లుకునేందుకు, భద్రపర్చుకునేందుకు రెండు భవనాలను నిర్మించారు. వాటి ఆలనాపాలనా చూసే నాథుడు లేక స్వల్ప మరమ్మతులకు గురయ్యాయి. విద్యుత్ వైరింగ్, పరికరాలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, స్విచ్‌బోర్డులైతే మూణ్నాళ్ల ముచ్చటే. బిగించిన రెండేమూడేళ్లలోనే పాడయ్యాయి. తలుపులు, కిటికీలకు అమర్చిన అద్దాలు ఎప్పుడో పగిలిపోయాయి. ఓ భవనాన్ని స్థానిక యువకులు చేపల వేట లేని సమయంలో వలల మాటున పేకాట స్థావరంగా మార్చుకున్నారు. చిన్నచిన్న మరమ్మతులతో సరిపెట్టుకునే వాటికి కూడా అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటంతో నిరుపయోగంగా మారి, అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసాలుగా మారుతున్నాయి.



పెచ్చులూడి ఇనుప చువ్వలు కనిపిస్తున్న స్తంభం



వలల అల్లిక భవనం దుస్థితి

మరమ్మతులు చేపట్టాలి



తీరంలో మత్స్యకారుల సౌకర్యార్థ ఏర్పాటు చేసిన భవనాల ఆలనాపాలనా చూసే వారు లేక మరమ్మతులకు గురయ్యాయి. శిథిల భవనాల్లో కార్యకలాపాలు నిర్వహించాలంటే భయంగా ఉంది. అధికారులు స్పందించి, నిధులు మంజూరు చేసి, వాటికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. నూతన భవనాలకు స్వల్ప మరమ్మతులు చేపట్టి, విద్యుత్ సదుపాయాన్ని పునరుద్ధరిస్తే సరిపోతుంది.

– కొవిరి హరి, మత్స్యకారుడు

శిథిల భవనాలతో ప్రాణ భయం



తీరంలో శిథిలావస్థకు చేరిన భవనాల్లో వలలు భద్రపర్చుకోవడం తప్ప, వలలు అల్లుకోవడం ఎప్పుడో మానేశాం. ఈ భవనం పిల్లర్లలో మూడు బాగా దెబ్బతిన్నాయి. ఏ క్షణంలో కూలిపోతుందోనని భయపడి వలల్ని ఆరు బయటే అల్లుకుంటున్నాం. మాధవస్వామి ఆలయం సమీపంలో నిర్మించిన భవనం కూడా శిథిలావస్థకు చేరింది. దీంతో క్షణక్షణం భయంభయంగా ఉంది.

– సూరాడ సోములు, మత్స్యకార్మికుడు

నీరు, పారిశుధ్యం, ఆరోగ్యంపై అవగాహన

- వాష్ శిక్షణలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి



శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

సబ్బవరం: నీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి తెలిపారు. సబ్బవరం మహిళా సమాఖ్య కార్యాలయంలో వాష్ కార్యక్రమాలపై బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న ఏరియా కో ఆర్డినేటర్లు, ఏపీఎంలు, సీసీలు వాష్ కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు కూడా అవగాహన కల్పించేలా గ్రామ స్థాయిలో పనిచేస్తున్న మహిళా సంఘాల సభ్యులకు, సమాఖ్య సభ్యులకు శిక్షణ ఇవ్వాలన్నారు. వీరి ద్వారా గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన పంపొందించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు, పరిసరాల పరిశుభ్రతతో ఎన్ని రోగాల నుంచి రక్షణ పొందవచ్చో వివరించాలన్నారు. ఈ శిక్షణలో నీరు, నీటి విలువ, వాడకం, నీటి నాణ్యతా ప్రమాణాలు, జల్ జీవన్ మిషన్, పారిశుద్ధ్యం, సమాజం బాధ్యత, సంఘ సభ్యుల సహకారం, పరిశుభ్రత తదితర అంశాలపై వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా కో ఆర్డినేటర్ పుల్లయ్య, సీహెచ్‌వో స్వర్ణలత, డీఆర్‌డీఏ సిబ్బంది, ఏపీఎంలు కె.శ్రీనివాసరావు, ఏరియా కో ఆర్డినేటర్ సత్యనారాయణలు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో డీపీఎంలు, ఏరియా కో ఆర్డినేటర్లు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

కూటమి మోసపూరిత హామీలపై పోరాటం



వార్డు నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: ఎన్నికల సమయంలో ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం, వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చేలా ప్రజల పక్షాన, అధికారపక్షాన్ని నిలదీయాలని నాయకులకు పిలుపునిచ్చారు. బుధవారం రాంపురంలోని క్యాంప్ కార్యాలయంలో జీవీఎంసీ 93వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులతో అదీప్‌రాజ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ తరఫున కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వార్డులోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి



ఫిజికల్ సైన్స్ స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్



పదోతరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో

- జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్

సింహాచలం: ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే విద్యార్థులకు పూర్తి న్యాయం చేయగలుగుతారని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం జరిగిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్‌ని డీఈవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర పఠనాసక్తి, నైపుణ్యం, విలువలతో కూడిన విద్యని బోధించినప్పుడే ఉపాధ్యాయులకు శాశ్వత కీర్తి ప్రతిష్టలు దక్కుతాయన్నారు. ఆ దిశగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రపంచంలో, దేశంలోను అమల్లో ఉన్న అత్యుత్తమ జ్ఞానాన్ని, విలువలను విద్యార్థులకు చేరువ చేయడంలో ఉపాధ్యాయులు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ఆ దిశగా ఉపాధ్యాయులు తమ వంతు కర్తవ్యం నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులకు సంబంధించి పలు ప్రశ్నలు వేశారు. ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని విద్యార్థుల్ని ఉత్తేజపరిచారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల ఆవరణలో ఉన్న మధ్యాహ్న భోజన పథకం వంటశాలని పరిశీలించారు. మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



దేశపాత్రునిపాలెం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళా సమాఖ్య సభ్యులు

పరవాడ: అత్యాచారానికి గురైన విద్యార్థినికి న్యాయం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి బూసి పరమేశ్వరి డిమాండ్ చేశారు. విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డ దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ దేశపాత్రునిపాలెం అంబేడ్కర్ విగ్రహం వద్ద మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఆడ పిల్లలకు రక్షణ కొరవడిందన్నారు. ప్రేమ, పెళ్లి పేరుతో ఆడ పిల్లలను వంచించే మృగాళ్లను శిక్షించడానికి నేడున్న నిర్భయ చట్టాలు చాలవని, ఇంకా కఠిన శిక్షలతో పటిష్టమైన చట్టాల అమలుకు ప్రత్యేక యంత్రాంగం అవసరమన్నారు. విద్యా సంస్థల్లో ఆడపిల్లల పట్ల సహచర విద్యార్థులు, పురుష సిబ్బంది ప్రవర్తనపై పోలీస్ నిఘా ఉండేలా నిబంధనలు ఉండాలన్నారు. కళాశాలలో ఆడ పిల్లల ఇబ్బందులు నిర్భయంగా చెప్పుకునేందుకు ఆత్మీయ స్పర్శ, నైపుణ్యం కలిగిన కౌన్సిలర్ల నియామకం తప్పనిసరి చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థినిపై జరిగిన అత్యాచార దోషులకు న్యాయవాదులు బెయిల్ పిటిషన్ వేయరాదని పిటిషన్ వేసిన న్యాయవాదిని బార్ అసోసియేషన్ నుంచి బహిష్కరించాలని న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. నిరసన కార్యక్రమంలో మహిళా సమాఖ్య ప్రతినిధులు లక్ష్మి, తులసి, సుగుణ, రమణమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విద్యార్థులకు ఉజ్వల భవిత

- ఘనంగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు



అడవివరం గ్రంథాలయంలో విద్యార్థులతో గొడవర్తి గోపాలకృష్ణమాచార్యులు, సిబ్బంది



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ బోకం సూర్యకుమారి, తదితరులు

పెందుర్తి: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వీటిని సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవాలని సూచించారు. వారం రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. డీఆర్‌సీ షాపింగ్ మాల్ అధినేత దాడి రమణచిట్టి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శరగడం నరసింహమూర్తి, ఏఎంసీ మాజీ చైర్మన్ వేగి దివాకర్, స్థానిక పెద్దలు ఆళ్ల సత్తిబాబు, దాడి సురేష్, ఉపాధ్యాయురాలు బలివాడ కృష్ణప్రియ, సంగీత గురువు భానుమతి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెతకంశెట్టి భూలోకరావు, ఆడారి రామకృష్ణ, పెంటకోట గణేష్, విశ్రాంత ఉపాధ్యాయులు జానకీరామ్, సత్యం మాస్టర్, గ్రంథాలయాధికారి బి.సూర్యకళ పాల్గొన్నారు.

సింహాచలం: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, ఉజ్వల భవితను పొందాలని సింహాచలం దేవస్థానం విశ్రాంత ప్రధానార్చకుడు గొడవర్తి గోపాలకృష్ణమాచార్యులు అన్నారు. అడవివరం గ్రంథాలయంలో వారం రోజులుగా నిర్వహించిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సరస్వతీదేవి విగ్రహం వద్ద జ్యోతిప్రజ్వలన చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మంచి పుస్తకం మన జీవితాన్ని ఎంతగానో మారుస్తుందన్నారు. గ్రంథాలయం ఉన్న గ్రామాలు అదృష్ట గ్రామాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రంథాలయ స్థలదాత దాసరి సన్యాసిశెట్టి మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. వాణీ విద్యా విహార్ ప్రిన్సిపాల్ సూర్యప్రభ మాట్లాడుతూ ఏ సమస్యకైనా చదువొక్కటే పరిష్కారం చూపగలదన్నారు. విద్యావేత్త రాజేష్ మాట్లాడుతూ భాష పట్ల శ్రద్ధ చూపడం ద్వారా బతుకుల్ని తీర్చిదిద్దుకోవచ్చన్నారు. వారోత్సవాల్లో భాగంగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, కార్మిక నాయకుడు సీహెచ్ఎస్ఎన్ రాజు, సింహాచలం దేవస్థానం విశ్రాంత పర్యవేక్షకుడు వి.కామేశ్వరరావు, గ్రంథాలయ ఉద్యోగి ఎల్లమ్మ, గ్రంథాలయ సహాయకులు టి.పి.కె.వర్మ, భానుమూర్తి, అనురాధ, పలు పాఠశాలలకి చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ బోకం సూర్యకుమారి మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, విజ్ఞాన భాండాగారాలని కొనియాడారు. విద్యార్థులంతా వీటిని సద్వినియోగం చేసుకుని తమ విజ్ఞాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నేటి యువత నిరంతరం సెల్ ఫోన్లకు అతుక్కుపోతున్నారని, గ్రంథాలయాలకు వెళ్లడం దినచర్యగా అలవర్చుకోవాలన్నారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు ఎంపీపీ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దేడ్డం ప్రసాదరావు, ఎంఈవో లక్ష్మణరావు, గ్రంథాలయ అధికారి వి.శిరీష, స్థానిక నాయకులు యర్రంశెట్టి రాము, కొల్లి కృష్ణ, జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రసాద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై దాడి

- రెండు పొక్లెయిన్లు, ఒక లారీ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న పొక్లెయిన్, లారీ

పరవాడ: దేశపాత్రునిపాలెం రెవెన్యూ పరిధి సర్వే నెం.334లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి తరలిస్తున్న రెండు పొక్లెయిన్లు, ఓ లారీని స్వాధీనం చేసుకున్నట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. దేశపాత్రునిపాలెం గ్రామ రెవెన్యూలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని అందిన సమాచారం మేరకు బుధవారం రాత్రి దాడులు నిర్వహించామన్నారు. గ్రావెల్ తవ్వకాలకు వినియోగిస్తున్న యంత్రాలతోపాటు, తరలిస్తున్న లారీని కూడా స్వాధీనం చేసుకుని, మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు సీఐ వెల్లడించారు.

హుండీల చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

- నిందితుడి నుంచి నగదు, బైక్, సెల్ ఫోన్ స్వాధీనం



మీడియా సమావేశంలో సీఐ పిన్నింటి రమణ, ఎస్ఐ సింహాచలం

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారం శ్రీకృష్ణుడి ఆలయంలో అక్టోబర్ 9న జరిగిన హుండీ చోరీ కేసును సబ్బవరం పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడిన వ్యక్తి నుంచి రూ.11,554 నగదు, బైక్, ఒక సెల్‌ఫోన్‌తో పాటు చోరీకి వినియోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, అనకాపల్లి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశం వివరాలను వెల్లడించారు. సబ్బవరం మూడు రోడ్ల కూడలి సమీపంలోని సినిమాహాల్ జంక్షన్ టీ స్టాల్ వద్ద ఒక వ్యక్తి చిల్లర కాయిన్స్ ఇచ్చి నోట్లు అడుగుతుండటంతో అక్కడే తన సిబ్బందితో ఉన్న ఎస్ఐ సింహాచలం అనుమానం వచ్చి స్టేషన్‌కు తరలించి విచారించారు. అతడిని శెట్టి నాయుడుగా గుర్తించారు. నాలుగేళ్లుగా బెలూన్ల డెకరేషన్ పనిచేస్తూ అనకాపల్లి గూండాల వీధిలో నివాసం ఉంటున్నాడు. అక్టోబర్ 9న రాయపుర అగ్రహారంలోని శ్రీకృష్ణ ఆలయంలో హుండీ తాళం పగులగొట్టి అందులోని నగదును సంచిలో వేసుకుని, హుండీని పక్కనే ఉన్న తుప్పల్లో పడేసి పోయాడు. ఈ నెల 9న జీ కోడూరు మండలం, వారాడలోని దుర్గాలమ్మ గుడి హుండీని, 2022 మార్చిలో దేవరాపల్లి మండలంలోని కలిగొట్ల గ్రామంలో పైడితల్లమ్మ గుడి హుండీని కూడా శెట్టి నాయుడే చోరీ చేసినట్లు విచారణలో తేలిందని సీఐ వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి, కోర్టుకు తరలించామన్నారు. సమావేశంలో సీఐతోపాటు ఎస్ఐ సింహాచలం పాల్గొన్నారు.

చిల్లర వర్తకులకు రక్షణ కల్పించాలి



రైతుబజార్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక రైతు బజార్ వద్ద దాదాపు మూడు దశాబ్దాలుగా ఉపాధి పొందుతున్న తోపుడు బండ్ల వర్తకులకు తగిన రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం చిల్లర వర్తకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. బుధవారం స్థానిక రైతు బజార్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజార్ వద్ద వర్తకులను జీవీఎంసీ అధికారులు ఇబ్బందులకు గురి చేయవద్దని కోరారు. నోటీసులు ఇవ్వకుండా బండ్లను తొలగించడం సరికాదన్నారు. కార్మికుల తరఫున పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రతినిధులు రమణి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.